క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

డిండి : మండల కేంద్రానికి చెందిన ఈరటి అంజనమ్మ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అంజనమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం డిండి పట్టణానికి చెందిన బాధమోని శ్రీనివాస్‌గౌడ్ బాధితురాలి భర్త ఆంజనేయులకు ఆర్థికసాయంగా రూ. 10వేలు అందజేశారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 28న హైదరాబాద్ ఓంకార్ భవనంలో నిర్వహించనున్న ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదిర్శ వస్కుల కిరణ్‌పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో ప్లీనరీకి సంబధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గణేష్, కళ్యాణ్, మల్లేష్, రవి, లాలునాయక్, రమణ, ఎలమ్మ, కమలమ్మ, మౌనిక, శారద, ఆశీర్వాదం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వెంకటయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వల్లపుదాసు వెంకటయ్య గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లు మంగళవారం పరామర్శించారు. వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, చిరుమర్రి కృష్ణయ్య, మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, పుట్టల కృపయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కోటయ్య, నగేష్, వెంకటేశ్వర్లు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సర్వే నంబర్ 88, 89లోని ప్రభుత్వ ప్లాటులో చేపట్టిన అక్రమ నిర్మాణాలని చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కొందరు అక్రమంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని వీరికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దుకు రాజీలేని పోరాటం చేస్తాం

నల్లగొండ టూటౌన్ : సీపీఎస్ రద్దు కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అన్నారు. రిటైర్డ్ సీపీఎస్ ఉద్యోగుల గోడు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ పట్టణంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల రిటైర్డ్ అయిన ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సర్వే సరే.. నిధుల జాడేది!

- గుర్రంపోడులో అభివృద్ధి పనులకు మంజూరు కాని నిధులు
- ప్రతిపాదనలు పంపిన అధికారులు



గుర్రంపోడులో సర్వే చేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు (ఫైల్)

గుర్రంపోడు : అంతన్నారు.. ఇంతన్నారు.. ఇప్పుడేమో నిధులు మంజూరు కాలేదంటున్నారు. ఇదీ మండలకేంద్రం అభివృద్ధి పనుల పరిస్థితి. మండలకేంద్రంలో జంక్షన్‌తోపాటు నాంపల్లి రోడ్డులో ప్రధాన రహదారి వెంట ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణాలు, రోడ్డు విస్తరణ, మధ్యలో డివైడర్ , సెంట్రల్ లైటింగ్ ఇలా మండల కేంద్రం అభివృద్ధికి గతేడాది సర్వే చేసి రూ.4కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో మండలకేంద్రానికి ఎట్టకేలకు మహర్దశ చేకూరినట్లేనని భావించారు. మండలకేంద్రంలో ప్రధాన రహదారుల వెంట డ్రెయినేజీల నిర్మాణాలు లేక రోడ్లపైనే మురుగునీరుతోపాటు వర్షపు నీరు నిల్వ సమస్య వర్షాకాలంలో తీవ్రం కావడంతో మండల కాంగ్రెస్ నాయకులు అప్పట్లో మాజీ మంత్రి జానారెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో జానారెడ్డి ఫోన్ ద్వారా ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకరాగా తక్షణమే స్పందించిన మంత్రి ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సర్వే చేసిన అధికారులు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. మండల కేంద్రంలో జంక్షన్‌తోపాటు నాంపల్లి రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల దూరం లోపల డ్రెయినేజీ నిర్మాణాన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వరకు కిలోమీటరు దూరం చేపట్టేలా ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం పది ఫీట్ల వెడల్పు ఉన్న రోడ్డును 14 ఫీట్లకు విస్తరించి మధ్యలో డివైడర్‌ను నిర్మించేలా ప్రతిపాదనలు తయారు చేశారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఈఎస్‌సీ కార్యాలయానికి పంపించామని, నిధులు మంజూరు కావల్సి ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నా నిధుల మంజూరుకు నిరీక్షణలు తప్పడం లేదు. నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి వెంట డ్రైనేజీల నిర్మాణాలు రోడ్డు విస్తరణ సమయంలోనే జరగాల్సి ఉందని చెబుతున్నా రోడ్డు విస్తరణ ఇప్పట్లో జరిగేలా లేక డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు సాగని బస్టాండ్ నిర్మాణం

మండలకేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి ఎంపీ రఘువీర్ రెడ్డి నిధుల నుంచి రూ.12లక్షలు నిధులు మంజూరైనా ఇందుకు సంబంధించిన పనులు మందుకుసాగడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి త్వరగా ఇక్కడ స్థలసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. ఇంతవరకు స్థలసేకరణ అడుగు ముందుకు పడలేదు. ఆర్అండ్‌బీ బంగ్లా ముందు భాగంలో ఆక్రమణలను తొలగించి బస్టాండ్ నిర్మాణానికి స్థలసేకరణ చేయడం సమస్యగా మారింది. గతంలో ఎమ్మెల్సీ నిధులు సులబ్ కాంప్లెక్స్‌కు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో జాప్యం జరిగి ఆ నిధులు ఇతర పనులకు మళ్లించగా ఇప్పుడు బస్టాండ్ పరిస్థితి ఇలా జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిరుపయోగంగా ఉండి శిథిలావస్థలో ఉన్న ఆర్అండ్‌బీ బంగ్లాకు వినియోగంలోకి తెచ్చేలా తక్షణమే ప్రతిపాదనలు పంపించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.కోటితో ప్రతిపాదనలు పంపించగా ఇంతవరకు మోక్షం లభించలేదు.

త్వరలో నిధుల మంజూరు



మండలకేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు జరిగేలా ఎంపీ, ఎమ్మెల్యేలు కృషిచేస్తున్నారు. ప్రతి పాదనలకు ఈఎన్‌సీ కార్యాలయంలో నిధుల కొరత కారణంగా మోక్షం లభించడం లేదు. త్వరలోనే మండల అభివృద్ధికి సంబంధించిన పనులన్నింటికీ మోక్షం లభిస్తుందని ఆశిస్తున్నాం.

– షేక్ సయ్యద్‌మియా, కాంగ్రెస్ నాయకుడు

బ్రహ్మకుమారీల పాత్ర మరువలేనిది





యోగా ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజయోగి సూరజ్‌కుమార్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : విశ్వశాంతి స్థాపనలో బ్రహ్మకుమారీల పాత్ర మరువలేనిదని రాజయోగి బికె.సూరజ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సర్వోత్తమ తీవ్ర పురుషార్థ యోగ సాధన ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాజయోగిని గీతా బహెన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రహ్మకుమారీలు స్వచ్ఛందంగా సమాజ సేవ చేస్తున్నారని, ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల్లో బ్రహ్మకుమారీ సంస్థలు రాజస్థాన్‌లోని మౌంట్ అబూ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విశ్వశాంతి కోసం బ్రహ్మకుమారీలు నిత్యం పరితపిస్తుంటారన్నారు. మూడు రోజులుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి బ్రహ్మకుమారీలు భారీగా తరలివచ్చారిహ్మ కార్యక్రమంలో మిర్యాలగూడ బ్రహ్మకుమారీస్ ప్రధాన సేవా కేంద్రం ఇన్‌చార్జి రాజయోగిని, బ్రహ్మకుమారీలు శకుంతల, ధనలక్ష్మి, హేమా, కె.రంగన్న, జెయిని ప్రకాశ్‌రావు, జెయిని మురళీ, కర్నాటి రమేష్, గుడిపాటి శ్రీనివాస్, రంగా రంజిత్, సింగిరికొండ వేణునాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించి ఆదుకోవాలి



మాట్లాడుతున్న పాల్వాయి రాంరెడ్డి

వేములపల్లి : మండలంలోని రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకుడు పాల్వాయి రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ముందస్తు వర్షాలు పడి ప్రాజెక్టులోకి సమృద్ధిగా నీరు చేరడతో రైతులు ఆశాజనకంగా వరిసాగు చేపట్టారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో మొదటి విడత యూరియా చల్లలేదన్నారు. దీంతో పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం చూపి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో వెంటనే సరిపడా అందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, పుట్టల సైదులు, సైదులు, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మిర్యాలగూడ టౌన్ : ఈదులగూడెం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీల

వేములపల్లి : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో రక్తహీనత నుంచి బయటపడవచ్చని మండల వైద్యాధికారి సుచరిత, సూపర్‌వైజర్ నాగమణిలు అన్నారు. మంగళవారం పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. పాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు వంటి బలవర్థకమైన ఆహారాన్ని గర్భిణులు తీసుకున్నట్లయితే పండంటి బిడ్డకు జన్మనివ్వచ్చన్నారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతా, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడిలు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో బొమ్మల ప్రదర్శన, ఆట -పాటలు, కథలతో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఈదులగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక ఉత్పత్తులు, బొమ్మలు, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు ఆట-పాటలతో బొమ్మలను ప్రదర్శించడం, పిల్లల తండ్రులకు వంటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా చిరు ధాన్యాలతో కలిగే లాభాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, లలితమ్మ, రామానుంజమ్మ, రజిత, లక్ష్మి, పార్వతతమ్మ పాల్గొన్నారు.

చింతకుంట్లలో..

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యుడు రసూల్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషక ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎం.గిరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూరియా తిప్పలు



తిరుమలగిరి(నాగార్జునసాగర్): బోయిగూడెంలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు



త్రిపురారం : రైతు వేదిక వద్ద బారులుదీరిన మహిళలు



అడవిదేవులపల్లి : రైతు వేదిక వద్ద బారులుదీరిన రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): రైతులు యూరియా కోసం మండల కేంద్రానికి వచ్చి పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లోని రైతు వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో యూరియాను పంపిణీ చేస్తున్నారు. తిరుమలగిరి(సాగర్) మండలానికి ప్రత్యేకంగా పీఏసీఎస్ లేకపోవడంతో ఇన్ని హాలియాకు వెళ్లాల్సి వచ్చింది. ఇది గుర్తించిన అధికారులు తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు, డొక్కలబావితండాలో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు యూరియా అందిస్తున్నారు. మంగళవారం తిరుమలగిరి, డొక్కలబావితండా తో పాటు కొంపల్లి లోని రైతువేదిక, బోయగూడెంలోని గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద రైతులకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు యూరియాను అందించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి గంట హర్షిత తెలిపారు. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో కేంద్రాల వద్దకు రావడంతో క్యూ లైన్‌లో బారులుదీరారు. గ్రామాల్లోకే యూరియా రావడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కాస్త ఉపశమనం పొందారు.

త్రిపురారం : మండల కేంద్రంలో ఎన్నెస్పీ క్యాంపు ఆవరణలో రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతుల బారులు కొనసాగుతున్నాయి. మంగళవారం యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం 4గంటల నుంచి మండల కేంద్రానికి చేరుకున్నారు. దూర ప్రాంత రైతులు అన్నం చద్దులతో వచ్చి యూరియా కోసం ఎదురుచూశారు. 200 వందల బస్తాలు రావడంతో వరుసలో ముందు ఉన్న రైతులకే యూరియా అందింది. దీంతో మిగిలిన రైతులు నిరాశగా వెనుదిరిగారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పలువురు తల్లిదండ్రులు యూరియా కోసం పిల్లలను వరుసలో ఉంచేందుకు తీసుకువచ్చారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

అడవిదేవులపల్లి : యూరియా కోసం అన్నదాతకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా ఇస్తున్నారన్న సమాచారంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుఝాము నుంచే క్యూ కట్టారు. యూరియా కోసం వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడ్డారు. అధికారులు ఒక్కక్క రైతుకు ఒక్క యూరియా బస్తా చొప్పున అందించారు. మధ్యాహ్నం రెండుగల సమయానికి ఒక్క లారీ లోడు యూరియా రావడంతో క్యూలో నిలబడిన వారికి కొంత మందికి మాత్రమే యూరియా అందాయి. దీంతో మిగిలిన రైతులు చేసేది ఏమిలేక వెనుదిరిగి వెళ్లిపోయారు. తాము 30 కిలో మీటర్ల దూరం నుంచి యూరియా కోసం వచ్చామని, ఐనా యూరియా అందలేదని మండలంలో జాలుకోటితండా, నడిగడ్డ ప్రాంతాలకు చెందిన రైతులు వాపోయారు

హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాలి



మిర్యాలగూడ అర్బన్ : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు



కొండమల్లేపల్లి : కరపత్రం ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

మిర్యాలగూడ అర్బన్ : ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో జాతీయ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి 28 వరకు ఐద్వా జాతీయ మహాసభలు జరుగుతాయని, మహిళలకు సమాన హక్కులు, విద్యా, వైద్యం, బాల్య వివాహాలు వంటి విషయాలపై జాతీయ మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు సైదమ్మ, నాగమణి, లక్ష్మి, రాధా, అంజమ్మ, ఎల్లమ్మ, వీరమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ మేరకు మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జాతీయ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ మహాసభలకు దేశ వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. మహిళల హక్కు సాధన కోసం ఐద్వా నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల పద్మ, సుల్తానా, సైదమ్మ, లక్ష్మి, జ్యోతి, సునిత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మెయిన్ రోడ్డులో టాపాసుల దుకాణాలు ఏర్పాటు చేయకుండా జన సంచారం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని కోరుతూ ఎస్‌సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. టాపాసుల దుకాణాలను ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు షాపింగ్ మాల్స్ ఉన్నాయని, ఏ చిన్న ప్రమాదం జరిగిన ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. జన సంచారం లేని ప్రాంతాల్లో పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ పత్రంలో వివరించారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు గాదగోని మహేష్ గౌడ్, పరంగి సురేష్, మంగ లక్ష్మణ్, సురేప్, రమేష్‌రాజు, కృష్ణ, నరేందర్, రవీందర్, నేహ్రూనాయక్, బంగారి, బిచ్చు తదితరులున్నారు.



సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

వైద్యశిబిరాలతో పశువుల ఆరోగ్య సంరక్షణ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రమేశ్, చైర్మన్ సత్యం

నిడమనూరు : గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్య శిబిరాలతో పశువుల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో తొడ్పడుతుందని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం ఊట్కూరులో పశు వైద్యశిబిరాన్ని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ పశువైద్య శిబిరాలతో పాల ఉత్పత్తి పెరిగి, రైతుల ఆర్థిక పురోగతికి తొడ్పడుతుందన్నారు. పశువుల సంరక్షణకు వైద్య శిబిరాలు అవసరమన్నారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు మేరెడ్డి సత్యనారాయణరెడ్డి, నరేందర్, చిరంజీవి, మండల పశువైద్యాధికారి, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ మహిపాల్‌రెడ్డి, డాక్టర్ సందీప్‌కుమార్, పశుగణన సహాయకులు ఎన్ రాహుల్, పి లోకేష్‌రెడ్డి, బిక్షయ్యా నాయక్, నాగయ్య, పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



కొండ్రపోల్‌లో రైతులు సాగుచేసిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటకు సోకిన తెగుళ్ల నివారణకు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు టి.కిరణ్‌బాబు, అరుణశ్రీలు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన కేఎన్ఎం 1638రకం వరి పంటలో ఆకుచుట్టు పురుగు, పాముపొడ, సుడిదోమ తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. నాణ్యత గల ఈ వరి రకం విత్తనాలను సాగు చేసి తదుపరి సీజన్‌లో సైతం విత్తనాలుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రుషేంద్రమణి, ఏఈఓలు పార్వతి, సైదులు, నరేష్, రైతులు ప్రభాకర్‌రావు, సైదులు, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా అల్వాల వంతెన



రక్షణ గోడలు లేకుండా ఉన్న అల్వాల వంతెన



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాల గ్రామ శివారులోని నాగార్జున సాగర్ ఎడమకాలువపై ఉన్న వంతెన ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వంతెన మీదుగా వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో పాటు, వంతెనకు ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు సైతం వంగిపోవడంతో వాహనాలు వంతెనపై ఎదురుపడ్డప్పుడు సమస్య తీవ్రతరం కానుంది. మల్లెపల్లి, పెద్దవూరతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. కాలువకు రెండు వైపులా ఎలాంటి రక్షణ గోడలను ఏర్పాటు చేయకపోవడంతో తిరుమలగిరి నుంచి అల్వాల మీదుగా వచ్చే వాహనాలు నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. వాహనాలు పడిపోయిన ఘటనలు కూడా గతంలో లేకపోలేదు. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వంతెన వద్ద ప్రమాదకరంగా మూలమలుపు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

కంకణాల దశరథమ్మ మృతి తీరని లోటు

కొండమల్లేపల్లి(చింతపల్లి): కంకణాల దశరథమ్మ మృతి తీరని లోటు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. చింతపల్లి మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి తల్లి దశరథమ్మ ప్రథమ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కేతావత్ బీల్యానాయక్, వడ్త్య రమేష్‌నాయక్, టీవీఎన్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వల్లపురెడ్డి పాల్గొన్నారు.



దశరథమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

గాయత్రీ దేవిగా దుర్గామాత



మిర్యాలగూడ : దామరచర్లలో అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు



కొండమల్లేపల్లి : గాయత్రీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



డిండి : పూజలు చేస్తున్న భక్తులు



మిర్యాలగూడ టౌన్ : విద్యానగర్‌లో..



హాలియా : వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద..